అన్నదాతకు విశిష్ట గుర్తింపు

- ఆధార్ తరహాలో ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయింపు
- వ్యవసాయ సంబంధిత పథకాలు, రాయితీలు పొందేందుకు అవకాశం
- రైతు సేవా కేంద్రాల్లో నమోదు ప్రారంభం
- నియోజకవర్గంలో 31,885 మంది రైతులు


వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

సత్తెనపల్లి: ఆధార్ కార్డు తరహాలోనే రైతులకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యతో కార్డులు జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే వ్యవసాయ, సంబంధిత పథకాలు, రాయితీలు, ప్రోత్సాహకాలు పొందేందుకు ఈ కార్డులు తప్పనిసరి అని అధికారులు చెబుతున్నారు. ఈ కార్డుల కోసం ఫార్మర్ రిజిస్ట్రీలో రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.
సత్తెనపల్లి నియోజకవర్గంలోని రైతు సేవా కేంద్రాల్లో (రైతు భరోసా కేంద్రాలు) ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వ్యవసాయ అధికారులు ప్రారంభించారు. పట్టాదారు పాస్ పుస్తకం, వన్ బీ, ఆధార్ కార్డు, ఆధార్ లింక్ అయిన ఫోన్ నెంబర్ తీసుకొని తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.
నియోజకవర్గంలోని మండలాల్లో సుమారు 35 వేల మంది రైతులు ఉన్నారు. చాలామంది రైతులకు ఈ కార్డుల గురించి ఇంకా తెలియకపోవడం, వ్యవసాయ సిబ్బంది పూర్తిస్థాయిలో అవగాహన కల్పించక పోవడంతో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ ప్రారంభమై మూడు రోజులు గడుస్తున్నా పదుల సంఖ్యలో కూడా ఆన్‌లైన్ కాలేదు. చాలామంది రైతులకు తమ ఆధార్ కార్డులకు ఫోన్ నెంబర్లు లింకు కాకపోవడం కూడా ఒక కారణం. అలాగే రీ సర్వే పూర్తయిన రెవెన్యూ గ్రామాల్లో ప్రతి సర్వే నెంబర్‌కు నూతనంగా ఎల్పీఎం (ల్యాండ్ పార్సెల్ మ్యాప్) నంబర్లు కేటాయించారు. ఎల్పీఎం నెంబర్లు ఆన్‌లైన్‌లో రాక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. భూమి తక్కువ ఉన్న రైతులకు ఎక్కువగా, ఎక్కువ ఉన్న రైతులకు తక్కువగా చూపిస్తుండడంతో ఏం చేయాలో తెలియడం లేదని రైతులు చెబుతున్నారు.

మొరాయిస్తున్న సర్వర్లు

ఒకేసారి అన్ని రైతు సేవా కేంద్రాల్లో విశిష్ట సంఖ్య నమోదు చేస్తుండడంతో సర్వర్లు మొరాయిస్తున్నాయి. ఆన్‌లైన్ ప్రక్రియలో భాగంగా రైతులకు ఓటీపీలు కూడా రావడం లేదు. రైతులు ఆర్ఎస్‌కేల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

బోలెడు ప్రయోజనాలు

ఆధార్ మాదిరిగా యూనిక్ కోడ్‌తో జారీ చేసే ఈ కార్డులు రైతులకు ఐడీ కార్డుగా ఉపయోగపడతాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అన్ని పథకాలను రైతుల యూనిక్ కోడ్‌తో అనుసంధానం చేస్తారు. రానున్న రోజుల్లో ఈ యూనిక్ నెంబర్ ఉన్న వారికే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, సబ్సిడీపై యంత్ర పరికరాలు, పంట రుణాలు తదితర పథకాలు నేరుగా పొందే వీలు కలుగుతుంది. అలాగే ఈ యూనిక్ నెంబర్‌ను ఉపయోగించి కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా బ్యాంకు లింకుతో కూడిన సేవలను పొందవచ్చు. దేశంలో ఎక్కడి నుంచైనా రైతుల రుణ అర్హత, రుణ బకాయిలు, ప్రభుత్వ పథకాల వివరాలను సులభంగా తెలుసుకోవచ్చు.

నమోదు ఇలా...

వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతు అర్హుడే. ఆధార్‌కు ఫోన్ నెంబర్ అనుసంధానమై ఉండాలి. పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ జిరాక్స్, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ నెంబర్ తీసుకొని రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలి. ఈ ఆధారాలతో రైతు వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేస్తారు. నమోదు ప్రక్రియ పూర్తయ్యాక వారికి విశిష్ట గుర్తింపు సంఖ్య రైతు సెల్‌ఫోన్‌కు ఓటీపీ ద్వారా కేటాయిస్తారు. ఆ నంబర్‌ను ఆన్‌లైన్‌లో ఎంటర్ చేస్తే నమోదు ప్రక్రియ పూర్తవుతుంది. రైతు సేవా కేంద్రాలకు వెళ్లలేని రైతులకు సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వివరాలు అందించి .. ఓటీపీ చెప్పడం ద్వారా నమోదు పూర్తి చేసుకోవచ్చు.

ఆందోళన చెందాల్సిన పని లేదు



ఆధార్ తరహాలో ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయింపు విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. ప్రతి రైతు పట్టాదారు పాస్ పుస్తకం. వన్ బీ, ఆధార్ కార్డ్, ఆధార్ కార్డ్‌కు లింక్ అయిన ఫోన్ నెంబర్ తీసుకొని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలి. ప్రస్తుతం అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఈ ప్రక్రియను చేపడుతున్నారు. ఇది ఈ నెలాఖరు నాటికి పూర్తి కావాలి. లేకుంటే ప్రభుత్వాలు అందించే పథకాలు, ప్రయోజనాలు పొందే అవకాశం కోల్పోతారు. గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎం నెంబర్‌ల సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

–ఎస్.శ్రీధర్ రెడ్డి, ఇన్‌చార్జ్ ఏడీఏ, సత్తెనపల్లి

మరమ్మతులు చేయండి



ముప్పాళ్ల : మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలోని శ్మశాన వాటిక వద్ద ఉన్న చేతిపంపు పాడై నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు నెల రోజులకుపైగా పాడై నిరుపయోగంగా ఉంది. సమస్యను పంచాయతీ సిబ్బంది దృష్టికి తెచ్చినా కూడా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చేది వేసవి కాలం కావడంతో నీటి సమస్య రాకుండా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో తేరుప్రదక్షిణ

విజయపురిసౌత్: స్థానిక సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆలయ విచారణ గురువు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ మాట్లాడుతూ సర్వ మానవ పాపాలను తొలగించేందుకు దైవ కుమారుడైన ఏసుక్రీస్తు మానవ రూపాన్ని ధరించి, సమస్త జీవకోటి ఆచరించాల్సిన విధి విధానాలను వెలుగులోకి తెచ్చారన్నారు. ఏసుక్రీస్తు సూచించిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు. దైవ సందేశాన్ని పాటించి సమాజంలో మంచి వ్యక్తులుగా గుర్తింపు పొందాలని చెప్పారు. అనంతరం దివ్యబలి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భక్తులు తల నీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తేరు ప్రదక్షిణలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

న్యాయవాది శేషగిరిరావుకు సత్కారం



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన హైకోర్టు న్యాయవాది ఉల్లం శేషగిరిరావు ఇటీవల దక్షిణ మధ్య రైల్వే న్యాయసలహా దారుడిగా నియమించబడిన సందర్భంగా పట్టణంలోని న్యాయవాది కార్యాలయంలో మానవ హక్కుల న్యాయవాది బత్తిన శ్రీనివాసబాబు ఆధ్వర్యంలో ఆదివారం చిరు సత్కారం గావించారు. ఈ సందర్భంగా న్యాయవాది బత్తిన శ్రీనివాసబాబు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే మంచి మనసున్న న్యాయవాది ఉల్లం శేషగిరిరావు మరెన్నో ఉన్నత పదవులను అధిరోహించాలన్నారు. అంతేకాకుండా తన కలంతో సమాజాన్ని కదిలించే విధంగా కవితా ప్రస్థానం గావిస్తున్న ప్రజా కవి ఉల్లం శేషగిరిరావు అని ఆయన సేవలను కొనియాడారు. అనంతరం పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించి ఆలింగనం చేసుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి

మరొకరికి గాయాలు



నకరికల్లు: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటన మండలంలోని దేచవరం మిద్దె సమీపంలో ఆదివారం జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దుర్గి మండలం అడిగొప్పల గ్రామానికి చెందిన వేల్పూరి నాగేశ్వరరావు, కసుకుర్తి సుమంత్(16)లు ద్విచక్ర వాహనంపై నరసరావుపేటకు బయలుదేరారు. మార్గంమధ్యలో దేచవరం మిద్దె వద్దకు చేరుకొనే సరికి గుర్తు తెలియని వాహనం వేగంగా ఢీకొట్టింది. ఘటనలో బైక్ నడుపుతున్న వేల్పూరి నాగేశ్వరరావు, సుమంత్‌లకు తీవ్ర గాయాలు కాగా కసుకుర్తి సుమంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. మృతుని తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



అచ్చంపేట: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని తాడువాయికి సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పుట్లగూడెం గ్రామానికి చెందిన పల్లెలపాటి గురునాథం బైకుపై తాడువాయి వెళుతుండగా ఎదురుగా వచ్చే లారీ ఢీకొట్టింది. గురునాథం కుడి కాలుకు తీవ్ర గాయమై రక్తస్రావం కావడంతో స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికులు గమనించి 108 అత్యవసర వాహనంలో సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. లారీ వేగంగా రావడాన్ని బాధితుడు గుర్తించకపోవడం వల్లనే ప్రమాదం చోటు చేసుకున్నట్లు స్థానికులు భావిస్తున్నారు.

గ్రంథాలయ నిర్మాణానికి స్థల పరిశీలన

నాదెండ్ల: సాతులూరు గ్రామంలో కొత్తగా ఏర్పడిన గ్రామాభివృద్ధి కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. సుమారు 15 వేల జనాభా కలిగిన గ్రామంలో గ్రంథాలయం లేనందున, లైబ్రరీ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. మూడు ప్రాంతాల్లో స్థలాలు పరిశీలించారు. గ్రంథాలయ శాశ్వత భవన నిర్మాణం, అనుమతులు, నిధులు తదితరాలపై చర్చించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు, గ్రామ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

కుక్కలకు కు.ని. ఆపరేషన్లు

వినుకొండ(నూజెండ్ల): పట్టణ పరిధిలోని కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ (ఏబీసీ) కార్యక్రమాన్ని 3వ విడత చేపట్టామని మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో పట్టుకున్న కుక్కలను స్నేహ వెల్ఫేర్ సొసైటీ పర్యవేక్షణలో ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్‌కు తరలించి వాటికి యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేయడంతోపాటు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నట్లు వివరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, మేస్త్రీలు అచ్చుకట్ల నాని, సాగర్, లక్ష్మయ్య, నాగరాజు, వెంకటేశ్వర్లుల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల కట్టడి

- ప్రధాన కూడళ్లలో ఏర్పాటు
- గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు
- నేరాలు, చోరీలలో కీలకం సీసీ ఫుటేజ్‌లు


అంచులవారిపాలెం ప్రధాన కూడలిలోని కళా మందిరానికి సీసీ కెమెరా ఏర్పాటు


గ్రామాలలో ప్రచారం నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది


మొక్కపాడులో విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

రాజుపాలెం: దొంగతనాలకు పాల్పడే వారిని పసిగట్టేందుకు, గ్రామాలలో అల్లరి మూకలను గుర్తించేందుకు సీసీ కెమెరాలు పోలీసులకు చాలా ఉపయోగపడతాయి. క్షణాలలో నేరస్తులను గుర్తించేందుకు సహకరిస్తాయి. సీసీ కెమెరాలను గ్రామాలలో ఏర్పాటు చేసినట్లయితే చోరీలు, అల్లర్లు తగ్గుతాయని గ్రామాలలో ఏర్పాటుకు రాజుపాలెం పోలీసు శాఖ నడుం బిగించింది. రోజురోజుకు నేరాల సంఖ్య పెరుగుతున్నందున కెమెరాల ప్రాధాన్యత పెరిగింది. పోలీసులు గ్రామాలలో పర్యటించి సీసీ కెమెరాల ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పలు గృహాల, షాపుల్లో కెమెరాల ఏర్పాటుకు యజమానులు ముందుకొస్తున్నారు.

విస్తృత ప్రచారం

ఇటీవల కాలంలో రాజుపాలెం పోలీసు స్టేషన్ సిబ్బంది ఆటోలలో లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేసుకుని గ్రామాలలో దొంగతనాలు, నేరాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కొత్త వ్యక్తులు రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లయితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు. అంతేగాక ప్రజలు దూర ప్రాంతాలకు గానీ, యాత్రలకు గానీ వెళ్లేటప్పుడు పోలీసులకు తెలియజేసినట్లయితే ఆ ఇంటిపై నిఘా ఏర్పాటు చేస్తామని ప్రచారం చేశారు.

గ్రామాలలో ఏర్పాటు

పల్నాడు జిల్లా ఎస్పీ కంచె శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ముందు జాగ్రత్త చర్యగా నేరాలు, చోరీలు, అల్లర్లను పసిగట్టేందుకు గ్రామాలలోని ప్రధాన కూడళ్లు, రహదారులలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మండలంలోని రాజుపాలెం, బ్రాహ్మణపల్లి, మొక్కపాడు, రెడ్డిగూడెం, గణపవరం, బలిజేపల్లి, ఉప్పలపాడు, ఇనిమెట్ల, లక్ష్మీపురం తండా, చల్లపల్లి తండా, చౌటపాపాయపాలెం, పులిచింతల నిర్వాసిత కేంద్రం, అంచుల వారిపాలెం, అనుపాలెం, పెదనెమలిపురి గ్రామాలలో ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ వేణుగోపాల్ తెలిపారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించి సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలి. ఒక్క సీసీ కెమెరా 10 మంది పోలీసులతో సమానమని, దొంగతనాలు, అల్లర్లు జరగకుండా ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించాలి. గ్రామాలలో సీసీ కెమెరాల ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తున్నాం.

– కొరిటాల వేణుగోపాల్, ఎస్ఐ, రాజుపాలెం

బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ రజతోత్సవాలు


రజతోత్సవంలో పాల్గొన్న సభ్యులు

పిడుగురాళ్ల: పట్టణంలోని వల్లెల గార్డెన్స్ నందు ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం రజతోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ జోన్ ఇన్‌చార్జి బీకే సవిత, విజయవాడ జోనల్ ఇన్‌చార్జి శాంత ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఉదయం 7 గంటలకు యోగా కార్యక్రమంతో ప్రారంభించి మురళీ క్లాసు నిర్వహించారు. 10 గంటలకు యోగా, ధారణాయుక్త, యోగానుభూతి క్లాసు, బాబాకు భోగ్ నిర్వహించి మధ్యాహ్నం 12 గంటలకు రజతోత్సవాలను ఏర్పాటు చేశారు. అనంతరం మహా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల సేవా కేంద్రం ఇన్‌చార్జి బ్రహ్మకుమారి సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

డైమండ్ జూబ్లీ నిర్వహించాలి


సమావేశానికి హాజరైన పూర్వ విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: బరంపేటలోని రామకృష్ణా ఓరియంటల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల డైమండ్ జూబ్లీ వేడుకలను పాఠశాల ప్రతిష్ట పెంచేలా నిర్వహించాలని పూర్వ విద్యార్థుల సంఘం నిర్ణయించింది. పాఠశాలలో ఆదివారం సంఘం ఆధ్వర్యంలో డైమండ్ జూబ్లీ తొలి సన్నాహక సమావేశం నిర్వహించారు. పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రధానోపాధ్యాయుడు బి.సత్యనారాయణసింగ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ, ఎన్నో ప్రత్యేకతలు కలిగిన సంస్కృత పాఠశాల ఔన్నత్యాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని నిర్ణయించారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ఏకం కావాలన్నారు. సమావేశంలో విద్యావేత్త డీఏఆర్ సుబ్రమణ్యం, జూలకంటి సీతారామాంజనేయులు, గట్టా శ్రీను, కోవూరి శ్రీనుబాబు, వి.వి.అంజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

5 కేజీల అండాశయ కణితి తొలగింపు


డాక్టర్లు తొలగించిన అండాశయ కణితి

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని శ్రీ దత్త సాయి నర్సింగ్ హోమ్ నందు అండాశయ కణితిని ఆదివారం వైద్యులు తొలగించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ... పట్టణానికి చెందిన సీహెచ్ పార్వతీ 10 రోజుల నుంచి కడుపు నొప్పి అని బాధపడుతూ దత్తసాయి నర్సింగ్ హోమ్‌ను సంప్రదించారని తెలిపారు. కొన్ని పరీక్షలు నిర్వహించి ఆమెకు అండాశయంలో కణితి ఉందని గుర్తించటం జరిగిందన్నారు. డాక్టర్ లలిత రాణి, డాక్టర్ వెంకట్ సహాయంతో వెంటనే ఆపరేషన్ నిర్వహించి ఐదు కేజీలున్న కణితిని తొలగించడం జరిగిందని తెలిపారు.

నేడు శివపార్వతుల శాంతి కల్యాణోత్సవం


స్వామివారి మూలవిరాట్

మిట్టగుడిపాడు(రెంటచింతల): మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో వేంచేసిన భ్రమరాంబ సమేత నాగేశ్వర స్వామి దేవస్థాన తిరుణాళ్ల వేడుకలను సోమవారం నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవస్థానం ప్రధాన అర్చకులు వెల్లటూరి నాగేశ్వరశర్మ ఆదివారం తెలిపారు. ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, 7 గంటలకు గణపతి పూజ, 8 గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, స్వామివార్లకు పంచామృతాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. 11 గంటలకు శివపార్వతుల వార్షిక శాంతి కల్యాణణ మహోత్సవంను భక్తులు పీటలపై కూర్చుని నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు వేడుకలలో పాల్గొన్న భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గ్రామంలో రాత్రి 4 భారి విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్ల దీవెనలు పొందాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో భక్తాంజనేయస్వామి వార్షికోత్సవం


విశేష అలంకారంలో భక్తాంజనేయస్వామి


సామూహిక సింధూరార్చనలో మహిళలు

సత్తెనపల్లి: పట్టణంలోని 25వ వార్డు మహారాష్ట్ర వీధిలో వేంచేసియున్న భక్తాంజనేయస్వామి వారి దేవస్థానం 25వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటలకు ఆలయ అర్చకులు వేదాంతం విజయ నరసింహాచార్యులు పూజలను ప్రారంభించారు. సుప్రభాత సేవ, తోరణ అలంకరణ, ప్రాతఃకాలార్చన విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, నవకలశ ఆరాధన, పంచామృత స్నపన, సహస్ర నాగవల్లి దళార్చన నిర్వహించారు. విశేష పుష్పాలంకరణ, సామూహిక సింధూరార్చన చేపట్టారు. నీరాజనం, మంత్రపుష్పం, తీర్థ గోష్ఠి నిర్వహించి భక్తాంజనేయస్వామికి బోనాలను సమర్పించారు. అనంతరం స్వామి వారి నగరోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సోమవారం కూడా వార్షికోత్సవ వేడుకలు కొనసాగుతున్నట్లు తెలిపారు.

ఆలయాల ప్రథమ వార్షికోత్సవం

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామంలోని పోలేరమ్మ,అద్దంకమ్మ, కనకమ్మ, మహాలక్ష్మమ్మ, పెద్దమ్మ, గంగమ్మ ఆలయాల ప్రథమ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు ఆదివారం నిర్వహించారు. గ్రామదేవతల సన్నిధిలో మహిళలు పొంగళ్ళు పొంగించి పసుపు, కుంకుమ, గాజులు, కొత్త వస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్తులు ఆలయ కమిటీ సభ్యుల సారథ్యంలో భారీ అన్నదానం నిర్వహించారు.

నేటి నుంచి ఒప్పిచర్లలో బ్రహ్మంగారి తిరునాళ్ల



కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల సోమ, మంగళ వారాల్లో రెండు రోజుల పాటు జరగనుంది. ప్రారంభరోజు బ్రహ్మం గారి ఉత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేస్తారు. అనంతరం వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబల కల్యాణాన్ని నిర్వహించనున్నారు. రెండవ రోజు ఆలయ ప్రాంగణంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. మహాన్నదానం కార్యక్రమాలు జరగనున్నాయి. రాత్రికి బ్రహ్మం గారికి గ్రామస్తులు భారీగా విద్యుద్దీపాలతో ప్రభలు కట్టి మొక్కులు చెల్లించనున్నారు. గ్రామానికి తిరునాళ్ల శోభ వచ్చింది. ఎక్కడెక్కడో ఉద్యోగాలు చేస్తున్న పిల్లలు, బంధువులు గ్రామానికి చేరుకుంటుండడంతో సందడి నెలకొంది. మఠాధిపతి ఎం.వీరబ్రహ్మాచారి ఆధ్వర్యంలో తిరునాళ్ల ఏర్పాట్లు చేస్తున్నారు. బజారుకొక ప్రభ చొప్పున కట్టడానికి గ్రామస్తులు సన్నాహాలు చేస్తున్నారు.

గౌరిజవోలులో సినిమా సందడి


సచివాలయ భవనంలో షూటింగ్ ఏర్పాట్లు చేస్తున్న సినీ బృందం

నాదెండ్ల: గౌరిజవోలు గ్రామంలో సోమవారం నుంచి ఐదు రోజుల పాటూ సినిమా షూటింగ్ జరగనుంది. దీనికి సంబంధించి గ్రామంలో సినీ బృందం ఏర్పాట్లు చేశారు. గౌరిజవోలు గ్రామానికి చెందిన సినీ హీరో శొంఠినేని శివాజీ, హీరోయిన్ లయ జోడీగా శ్రీ శివాజీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఈ చిత్రం రూపొందుతోంది. దర్శకుడిగా సుధీర్‌శ్రీరాం, కెమేరామెన్‌గా రుత్విక్‌రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్‌గా సందీప్ వ్యవహరిస్తున్నారు. హీరో శివాజీ నిజాయితీ గల పంచాయతీ కార్యదర్శి (ప్రభుత్వ ఉద్యోగి) రోల్‌లో నటించనున్నారు. అన్నమయ్య జిల్లా కొత్తకోట మండలం, హార్స్‌లీహిల్స్ గ్రామ లొకేషన్ తరహాలో గ్రామంలోని ప్రభుత్వ భవనాలపై పేర్లను మార్పు చేశారు. సోమవారం నుంచి ఐదు రోజులపాటూ గౌరిజవోలు గ్రామంలోని సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ లలో షూటింగ్ జరగనుంది. షూటింగ్‌లో భాగంగా యడ్లపాడు మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన కొండవీడుకోట, తూబాడు గ్రామంలోని నాలుగు కూడళ్ళ జంక్షన్ తదితర ప్రాంతాల్లో షూటింగ్ జరపనున్నట్లు సినీ బృందం తెలిపింది.

మహిళ మెడలో గొలుసు చోరీ

ముప్పాళ్ల: మండలంలోని సత్తెనపల్లి–నరసరావుపేట ప్రధాన రహదారిపై ఇరుకుపాలెం సమీపంలో టీవీఎస్ వాహనంపై అన్నతో కలిసి వస్తున్న మహిళ మెడలో బంగారు నానుతాడు లాక్కెళ్లిన ఘటన ఆదివారం జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం భీమవరం గ్రామానికి చెందిన మేకల పద్మ, తన అన్న బద్దు రాఘవయ్యతో కలిసి నరసరావుపేట మండలంలోని సాతులూరు గ్రామంలో జరిగిన అంత్యక్రియలకు హాజరై టీవీఎస్ ఎక్సెల్‌పై ఇంటికి వస్తున్నారు. ఇరుకుపాలెం సమీపంలోకి రాగానే వెనకాలే ద్విచక్ర వాహనంపై వస్తున్న యువకుడు పద్మ మెడలోని బంగారు నానుతాడు లాక్కొని సత్తెనపల్లి వైపు వెళ్లిపోయాడు. ఆ మేరకు పోలీసులు పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. అయితే ఆగంతకుడు గోళ్ళపాడు వద్ద నుంచి ద్విచక్ర వాహనంపై వెంబడిస్తున్నాడని, హెల్మెట్ ధరించి ఉన్నాడని బాధితులు పోలీసులకు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి.సోమేశ్వరరావు తెలిపారు.